# ఆడది




వై.కె.మూర్తి

ఇంటికి తాళం వేసి వుండటంతో ఒక్కసారే నీరసం వచ్చేసింది. కమల ఎక్కడికి వెళ్లుంటుంది? చెమటతో తడిసిన బట్టలు, కాఫీకోసం ఆరాటం కొంత చికాకు తెచ్చిపెట్టాయి.

మాది మొత్తం నాలుగు పోర్షనులున్న యిల్లు. అందులో రకరకాల మనస్తత్వాల, ఉద్యోగాల వాళ్లం కాపురముంటున్నాం. దాదాపు అందరికీ ఉద్యోగాలే, ఒకాయనకు మాత్రం చిన్న వ్యాపారం.  ప్రక్కకు చూసాను. అందులోనే ఎదురుగా 'చలపతి'గారింటివైపుకూడా చూసాను. అన్నీ తాళాలు వేసే వున్నాయి.

కొంపతీసి ఎవరికేమన్నా అయిందా అనుకున్నాను. అయితే ఆఫీసుకు కబురు వచ్చేది! ఏమయివుంటుంది? ఆడవాళ్లందరూ కలిసి సినిమాకి చెక్కేసారేమో. ఎక్కడికన్నా వెళ్లాలనుకుంటే కమల ముందే చెబుతుంది. వెనక్కు తిరిగాను. ఆ గదులూ తాళం కప్పలతో కనిపించాయి. ఇదేదో ఉద్యమంలా వుందే అనిపించింది. అయినా వీళ్ళలో అంత స్పందన, చైతన్యం ఏ కోశాన లేవు. ఎంతసేపూ టి.వీ సీరియల్స్, కొత్త సినిమా సంగతులు, వంటకాల గురించే. ఇలా ఓ రొటీన్ కార్యక్రమానికి అలవాటు పడిపోయారు. ఏమాటకామాటే చెప్పుకోవాలి. వీరి కొత్తరకం వంటకాలు మహారుచిగా వుంటాయి.

వీరిలో చైతన్యం కలిగించాలని నేనుచేసిన ప్రయత్నాలన్నీ విఫలం కాగా నన్ను పిచ్చివాడుగా చూడటం వీరి అలవాటు. అంతమాత్రాన నిరుత్సాహపడలేదనుకోండి. అనుభవంలో గాని ఓ విషయం మీద బలమైన అభిప్రాయం ఏర్పరుచుకోవడం సాధ్యం కాదు. ఎక్కడికీ వెళ్ళాలనిపించక అక్కడే

కూర్చున్నాను.

చీకటి పడుతుండగా కమల వచ్చింది హడావుడిగా,

"ఎంత సేపయిందొచ్చి" అంటూ.....

"అది సరేలే, మీరంతా ఎక్కడకు వెళ్లారు" అన్నాను.

"సుశీలగారికి నొప్పులొస్తేనూ" అంది తాళం తీస్తూ... అప్పుడు గుర్తుకొచ్చింది, అవును కదా, చలపతి తండ్రి కాబోతున్నాడు. ఐదునిమిషాల్లో కాఫీ చేసి యిచ్చింది.

"ఏమయింది మరి" అన్నాను త్రాగుతూ.

"ఇంకా ఎక్కడ, నొప్పులొస్తున్నాయి, మీకోసం వచ్చాను... మళ్ళీ వెళ్ళాలి' అంటూనే వంట కార్యక్రమంలో మునిగిపోయింది. త్వరగా వంట చేసి 'ఆకలయితే మీరు భోం చేయండి. లేకుంటే ఆగండి' అంది వెళ్తూ.

"ఆలోచనల్లో నిద్ర పట్టేసింది. కమల ఎప్పుడు వచ్చిందో తలుపు తడుతుంటే మెలకువ వచ్చింది".

"భోం చేసారా?"

"లేదు"

"లేవండి మరి"

"ఏం పిల్ల"

"ఆడపిల్ల"

"ఊహూ" అన్నాను.

కమల మెల్లగా అంది.

"ఆ పిల్ల చాలా వికారంగాపుట్టింది, కాళ్లు చేతులూ లేకుండా, మమ్మల్ని చూడనివ్వలేదు, దడుసుకుంటామని కాబోలు'.

"ఎందుకట అలా జరగటం?" ఆరాటంతో అడిగాను.

"ఏమో బాబు, చలపతిగారి అక్క కూతురేగా ఆవిడ' అంది.

ఓహ్ ! మేనరికం ! ఎన్ని అనర్థాలకు దారి తీస్తోంది. అప్యాయతలూ, అనురాగాలూ ఉండొచ్చు. కానీ ఈ విధంగా పెళ్లిళ్లు చేసుకోవటం మూలాన ఎంత నష్టం ? ఆలోచించరేం !

"భోం చేద్దురుగాని రండి" అంది కమల.

నాకు మనస్కరించలేదు. మంచినీళ్లు తాగి పడుకున్నాను. కమల కూడా భోం చేయలేదు. పడుకుంటూ అంది.

'పాపను తీసుకెళ్లిపోయారు'

'ఏమిటీ,పోయిందా?' ఆశ్చర్యంగా అన్నాను.

'అలాంటి వాళ్లు బ్రతకరు'

'అయ్యో' నాకు తెలియకుండానే అన్నాను.

'చలపతిగారి అమ్మను చూసారా మీరు' అంది కమల.

'ఊ... చూస్తే...'

'ఆ పిల్లను తీసుకెళ్తుంటే కొంచమైనా బాధ పడలేదు. ఏదో బరువు తగ్గినట్లు భావిస్తున్నట్లుంది' అంది.

'దేనికట' అన్నాను యథాలాపంగా

'ఆడది కదా' అంది విసుగ్గా.

చాచి చెంపమీద కొట్టినట్లయింది. సామాజిక స్పృహ లేని కమలని చూస్తుంటే అనిపించింది. వికృతంగా వున్న పాపరూపం, ఇంకా వికృతంగా వున్న వ్యవస్థ రూపం. ఆ ముసలావిడ్ని కమల అర్థం చేసుకోలేకపోవచ్చు, నాకు జాలి కలిగింది.

ఆడది ఇవ్వాళ ఎంత ప్రగతి సాధిస్తున్నా, ఆడది బరువు ఈ సమాజంలో...., ఆ పాపనయితే స్మశానానికి తీసుకెళ్ళారు...మరి... ఈ వ్యవస్థనో.....!!

# అగ్నిచుంబనం

చెడు, చూడొద్దన్నారు,
ఇక చూసేదేముంది?
చూడటం మానేసాను.
చెడు, వినొద్దన్నారు
ఇక వినేదేముంది?
వినటం మానేసాను.
చూపు, వినికిడి లేని మనిషి
మూగవాడు కావటం సహజం
అందుకే, నా కిప్పుడు పెదవి పెగలటం లేదు
మనసు నిద్రలో వుంది, మొద్దునిద్రలో వుంది.
స్పందన లేదు, చనిపోతున్నాను.
బీటవారిన పుడమి పెదవిని
ముద్దాడే తొలి చినుకులు
పక్కలోని ప్రియురాలి బుగ్గపై
విరిసే లేలేత గులాబీలు
పసిపాప పెదవుల పైన జాజిపూలు
భూమి గర్భం చీల్చి లేచే
విత్తనపు పసి పాదాలు
బాంబులకు బలైన నేస్తాలు
వాన, నెత్తుటివాన
గంటిపడిన జీవితాల కన్నీటి వరదలు
ఏవి నన్ను కదలించవు
నిద్రలో వున్నాను,మోహనిద్రలో వున్నాను
ధనకనకవాహనాల పద్మవ్యూహంలో
మౌన నిద్రలో వున్నాను, కొన ఊపిరితో వున్నాను
నన్ను బ్రతికించండి
ఒక అగ్ని చుంబనమిచ్చి బ్రతికించండి
అగ్నిచుంబనమంటే
అమావాస్య చీకటిలో క్షణిక వెలుగిచ్చే
మతాబుల చుంబనం కాదు
పుట్టలోని నాగుపాము బెదరని
తాటాకు టపాకాయల చుంబనం కాదు
వేలవేల టన్నుల టి.ఎన్.టీల విస్ఫోటనం కావాలి
నేను మేల్కొనే అగ్నిచుంబనం కావాలి
ప్రపంచం మేల్కొనే అగ్నిచుంబనం కావాలి.

- ఎల్.ఆర్.స్వామి